www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 19 మార్చి 2024
5
కాకినాడ



కేంద్ర పోలీసు బలగాల కవాతు



అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ప్రజలకు భరోసా కల్పిస్తూ మండలంలోని కొనపాపపేట గ్రామంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. సోమవారం డిఎస్‌పి ప్రమోద్, పిఠాపురం సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ స్వామి నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కవాతులో డిఎస్‌పి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి పోలీసు బందోబస్తు నిర్వహిస్తారని తెలిపారు.

అందరి చూపూ..పిఠాపురం వైపు..!

- పవన్ పోటీపై పెరిగిన ఆసక్తి
- వర్మ నిర్ణయంతో వైసిపిలో గుబులు





ప్రజాశక్తి - పిఠాపురం

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఇప్పటికే అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన అభ్యర్థుల ఎంపిక ఆఖరు దశకు చేరుకుంది. అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఈ ఎన్నికలను ఎదుర్కొనేందుకు సన్నద్ధం అయ్యాయి. ఈ నేపథ్యంలోనే జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు సై అన్నారు. దీంతో పిఠాపురం నియోజకవర్గంపైనే అందరి చూపు కన్సిస్తోంది. 1952లో నియోజకవర్గం ఏర్పడింది. గతంలో మెజార్టీ భాగం నియోజకవర్గంలో ఉండగా యు కొత్తపల్లి మండలంలో గోర్స గ్రామం మినహా మిగిలిన మండలం సంపర నియోజకవర్గంలో ఉండేది. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం యు.కొత్తపల్లి మండలం పూర్తిగా ఈ సెగ్మెంట్‌లో విలీనమయ్యాయి. తొలిసారి జరిగిన ఎన్నికల్లో ఆర్‌ఎస్.జగ్గారావు(సిపిఐ) గెలుపొందారు. ఇప్పటికి 16 సార్లు ఎన్నికలు జరిగాయి. ఆయా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 5 దఫాలు, టిడిపి 3, ప్రజాపార్టీ 2, ఇండిపెండెంట్లు 2, సిపిఐ, బిజెపి, పిఆర్‌పి, వైసిపి ఒక్కోసారి ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించాయి.

2019 ఎన్నికల్లో వైసిపి నుంచి పోటీ చేసిన దొరబాబు తన ప్రత్యర్థి ఎస్‌విఎస్ఎన్.వర్మ(టిడిపి)పై విజయం సాధించారు. అయితే ఈ దఫా పార్టీ అధిష్ఠానం ఆయనకు మొండిచెయి చూపింది. ఆయన స్థానంలో ఎంపి వంగా గీతను ఇక్కడ నుంచి పోటీలో నిలిపింది. ఆమె 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఆ అనుభవం, పరిచయాలను దృష్టిలో పెట్టుకుని వైసిపి అధిష్టానం ఈ దఫా ఎన్నికల్లో ఆమెను అభ్యర్థిగా ప్రకటించింది. మరోసారి ఆమె తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

ఇక టిడిపి, జనసేన, బిజెపి కూటమి నుంచి టిక్కెట్టును ఆశించిన టిడిపి సీనియర్ నేత వర్మకు మొండి చేయి తప్పలేదు. 2014 ఎన్నికల్లోనూ గతంలో టిడిపి అధిష్ఠానం వ్యవహరించింది. అప్పటి వరకూ తనదే టిక్కెట్టు అని అందరూ భావించారు. అయితే పార్టీ అధిష్టానం పోతుల విశ్వంకు టిక్కెట్టును ఖరారు చేసింది. దీంతో ఆయన ఇండిపెండెంట్‌గా పోటీ చేసి విజయం సాధించారు. అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను కాదని పిఠాపురం ఓటర్లు విలక్షణంగా ఆలోచించి వర్మను గెలిపించారు. అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో ఆయన సొంత గూటికి చేరారు. 2019 ఎన్నికల్లో అప్పటి అధికార టిడిపి నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. నాటి నుంచి నేటి వరకూ టిడిపిలోనే కొనసాగారు. అయితే టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో భాగంగా పిఠాపురం సీటును జనసేనకు కేటాయించారు. దీంతో వర్మకు ఈ దఫా టిక్కెట్ దక్కలేదు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో వర్మ వర్గీయులు ఒక్కసారిగా రోడ్లపైకి వచ్చి తీవ్ర ఆగ్రహావేశాలకు లోనయ్యారు. పార్టీ కార్యాలయంపై వద్ద చిందరవందర చేశారు. ఫ్లెక్సీలు, జెండాలను దహనం చేశారు. ఇండిపెండెంట్‌గా రంగంలో నిలుస్తారనే ప్రచారం జోరుగా సాగింది. పిఠాపురం నియోజకవర్గంలో త్రిముఖ పోటీ తప్పదు అన్నట్లుగా పరిస్థితులు మారాయి. అయితే టిడిపి అధినేత చంద్రబాబు ఆయనతో మాట్లాడి స్పష్టమైన హామీ ఇవ్వడంతో వర్మ శాంతించారు. పవన్ గెలుపే తన గెలుపుగా భావిస్తానని, టిడిపి శ్రేణులంతా పవన్ కళ్యాణ్ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పార్టీ శ్రేణుల సమావేశంలో పిలుపునిచ్చారు. దీంతో నియోజకవర్గంలో ప్రధాన పోటీ వైసిపి అభ్యర్థి వంగా గీత, జనసేన పార్టీ అభ్యర్థి పవన్ కళ్యాణ్ మధ్యనే జరగనుంది. వర్మ వెనక్కు తగ్గడం, ఇండిపెండెంట్‌గా పోటీలో ఉంటే తమ విజయం నల్లేరుపై నడకే అన్నట్లుగా వైసిపి భావించింది. అయితే వర్మ శాంతించడం, పవన్ విజయమే తన విజయమని చేసిన ప్రకటనతో వైసిపిలో గుబులు రేకెత్తిస్తోంది.

బలం- బలహీనత

నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ఒకే సామాజికవర్గానికి చెందిన వారే కావడంతో పోటీ రసవత్తరంగా మారనుంది. వారి సామాజికవర్గానికి చెందిన ఓట్లే నియోజకవర్గంలో అత్యధికం. అధిక శాతం ఓట్లు కలిగిన ఓటర్లు ఎవరి పక్షాన నిలబడతారనే ఆసక్తి నేడు నెలకొంది. అయితే అధిక శాతం ఓట్లు కలిగిన ఒకే సామాజికవర్గం రెండుగా చీలిపోయినా, మిగిలిన సామాజికవర్గాలకు చెందిన ఓటర్లు ఇచ్చే తీర్పు వీరి గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. నియోజకవర్గంలో గతంలో పనిచేసిన అనుభవం, పరిచయాలు, వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే తన విజయానికి దోహదం చేస్తాయని ఆమె ధీమాను వ్యక్తం చేస్తున్నారు. అయితే సిట్టింగ్ ఎంఎల్‌ఎ పెండెం దొరబాబు అనుచరులు ఒక్కరొక్కరుగా గీత అనుచరులుగా మారు తున్నారు. అయితే వారంతా ఆమెకు ఎంతవరకూ సహకరిస్తారనేది ప్రశ్నార్థకమే. ఇక జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నియోజక వర్గంలో మాస్ ఫాలోయింగ్ ఉండటంతోపాటు, ఒక పార్టీ అధినేతే పోటీలో నిలవడంతో జనసేన నాయకులు, కార్యకర్తల్లో ఉత్సా హం రెట్టింపు అయ్యింది. ఇకపై తమ అభిమాన నాయకుడు తమ కళ్లెదుటే ఉంటారనే సంతోషంతోపాటు, జనసేన పార్టీకి రాష్ట్రవ్యాప్తంగా బలంగా నిలిచిన ఆయన సామాజికవర్గానికి చెందిన ఓటర్లే ఇక్కడ అధికంగా ఉండటం కలిసొచ్చే అంశంగా ముంది. నియోజకవర్గంలో బిజెపి పరిస్థితి అంతంత మాత్రమే.బలమైన కేడర్ ఉన్న టిడిపి పవన్ కళ్యాణ్ గెలుపునకు ఏ మేరకు సహకరిస్తారనేది వేచిచూడాల్సిందే.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

ఫొటోలు, ఫ్లెక్సీలు, హోర్డింగుల తొలగింపు

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్నికల ప్రచారంలో భాగంగా వివిధ రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన బ్యానర్లు, ఫోటోలు, హోర్డింగులను 72 గంటల్లోపు తొలగించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు సహకరించాలని కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఎన్నికల షెడ్యూల్, ఓటర్ల జాబితా, ఎన్ని కలకు నియమించిన అధికారుల వివరాలు, ఫారం 6, 7, 8లకు సంబంధించి దాఖలైన దరఖాస్తుల పరిష్కారం, ఈ-ఎపిక్ కార్డుల పంపిణీ, పోలింగ్ కేంద్రాలు, ఇవిఎంలు, వివిప్యాట్ వినియోగంపై ప్రజల కు అవగాహన, స్టోరేజ్ పాయింట్, కౌంటింగ్ కేంద్రాలు, కంట్రోల్ రూములు, ఎన్నికల ప్రవర్తన నియమావళి వంటి అంశాలపై కలెక్టర్ వారికి వివరిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ తీసుకొచ్చిన మార్గదర్శకాలను, సూచనలను ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీ ప్రతినిధులకు సమావేశాలు నిర్వహించి వివరించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మార్చి 17 నాటికి మొత్తం 16,11,171 మంది ఓటర్లు ఉన్నా రన్నారు. ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ రాజ కీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికల నియమా వళిని ఉల్లంఘించే రాజకీయ పార్టీలు, వ్యక్తులపై చర్య తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పటిష్టంగా అమలుకు జిల్లాలో సి-విజిల్ యాప్, పోలీస్, ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్ సర్వేలెన్స్ ఇతర బృందాలు నిత్యం పర్యవేక్షణలో ఉం టాయన్నారు. జిల్లాలో నిష్పక్షపాతంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతిని ధులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ డాక్టర్ డి.తిప్పేనాయక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు (వైసిపి), గదుల సాయిబాబా(టిడిపి), సబ్బారపు అప్పారావు(బిఎస్‌పి), ఆకుల వెంకటరమణ (కాంగ్రెస్), సిహెచ్.రమేష్ బాబు(బిజెపి), వాసంశెట్టి చంద్రరావు (సిపిఎం), ఎన్ని కల విభాగం అధికారి ఎం.జగన్నాథం, పాల్గొన్నారు.

జయలక్ష్మి సొసైటీ బాధితులను ఆదుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

ప్రజాశక్తి - పిఠాపురం

జయలక్ష్మి కో ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ బాధితులను ఆదుకోవాలని పిఠాపురం బ్రాహ్మణ సేవా పరిషత్ అధ్యక్షుడు, సోషల్ యాక్టివిస్ట్ యనమండ్ర సూర్యనారాయణ, సిహెచ్.పళ్ళంరాజు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్టువార్ట్ పేటలో పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. బ్యాంకులో లక్షలాది రూపాయలు డిపాజిట్ చేసిన బాధితుల్లో చాలామంది ఆర్థికంగా, మానసికంగా కృంగిపోయి మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మంది ఆసుపత్రుల పాలవవు తున్నారని అన్నారు. ఈ సమస్యను సిఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ప్రభుత్వం తక్షణమే జయలక్ష్మి బ్యాంకు బాధితులపై ప్రత్యేక దృష్టిపెట్టి, వారి డబ్బులు వారికి ఇప్పించేలా చర్యలు వేగవంతం చేసి ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో సుబ్రహ్మణ్యం, త్రిమూర్తులు, కృష్ణారావు, భాస్కరరావు, ప్రకాశ్ పాల్గొన్నారు.

భవిత కేంద్ర పనితీరు పరిశీలన

ప్రజాశక్తి - సామర్లకోట

మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 'భవిత' కేంద్రాన్ని జిల్లా సహిత విద్య సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. విద్యాశాఖ అధికారి -2 పి పుల్లయ్య పర్యవేక్షణలో నడుస్తున్న భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సోమవారం జరిగే ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని ప్రతీరోజు ఇంటి వద్ద తల్లీదండ్రులు చేయాలని సూచించారు. ప్రతీరోజు భవిత సెంటర్‌కు హాజరౌతున్న విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. భవిత కేంద్రం ద్వారా మంచి సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని, వాటిని దివ్యాంగ విద్యార్థులు, తల్లి దండ్రులు ఉపయోగించు కోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల మానసికాభివృద్ధి, వారి అకాడమీక్ స్కిల్స్‌ను పరిశీలించారు. భవిత కేంద్రం ద్వారా 12 మంది వికలాంగ విద్యార్థులకు అందించిన ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సామర్ల కోటలో వికలాంగ విద్యార్థులు సర్వేలో 320 మంది ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భవిత సిబ్బంది, ఫిజియోథెరఫిస్టు సేవలను ఆయన అభినందించారు.



ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న చామంతి

ప్రశాంతంగా 10వ తరగతి పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లావ్యాప్తంగా సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో ప్రారంభం అయ్యాయి. జిల్లావ్యాప్తంగా 10వ తరగతి తెలుగు పేపర్ పరీక్ష, కాంపోజిట్ తెలుగు పేపర్-1 పరీక్ష ప్రశాంతంగా జరిగాయి. పరీక్షలకు 28,998 మంది విద్యార్థులు హాజరుకావాల్సివుండగా, 28,127 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని డిఇఒ పి.రమేష్ తెలిపారు. జిల్లా పరిశీలకులు 6 పరీక్షా కేంద్రాలను, జిల్లా విద్యాశాఖాధికారి 07 కేంద్రాలను, అసిస్టెంట్ కమిషనర్ 5 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. తనిఖీ అధికార్లు 35 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. **కిర్లంపూడి** మండలంలో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో 5 సెంటర్లలో పరీక్షలను నిర్వహించగా 1047 మంది విద్యార్థులకు గాను 1013 మంది విద్యార్థులు హాజరయ్యారు. 34 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఇఒ జోసఫ్ తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 989 మందికి 982 మంది, ప్రయివేట్ విద్యార్థులు 58 మందికి 31 మంది హాజరయ్యారని చెప్పారు. **తాళ్లరేవు** మండల పరిధిలో 5 కేంద్రాల్లో 10వ తరగతి పరీక్షలు జరిగాయి. 1118 విద్యార్థులకు గాను 1068 పరీక్ష రాశారని, 50 మంది విద్యార్థులు హాజరు కాలేదని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. పటవలలోని జడ్‌పి ఉన్నత పాఠశాలలో 231 మందికి 228, పి.మల్లవరం 219కి 218, ఇంజరంలో 170కి 169, తాళ్లరేవులో 283కి 254 మంది, తాళ్లరేవు జూనియర్ కళాశాల కేంద్రంలో 215కి 199 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొదటి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. **పెద్దాపురం** పట్టణ పరిధిలో 4 సెంటర్లు, మండల పరిధిలో 3 సెంటర్లలో 10వ తరగతి పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు 1671 మంది హాజరు కావలసి ఉండగా 1607 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఇఒలు చౌదరి, శర్మలు తెలిపారు. మండల పరిధిలో పరీక్షలు జరుగుతున్న 7 సెంటర్లను సోమవారం పరిశీలించామని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. **గండేపల్లి** మండలంలో ఏర్పాటు చేసిన 3 పరీక్షా కేంద్రాల్లో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 513 మంది విద్యార్థులకు గాను 495 మంది హాజరయ్యారని ఎంఇఒ కెహెచ్.నాయక్ తెలిపారు. గండేపల్లి పరీక్షా కేంద్రంలో 172 మంది విద్యార్థులకు గాను 157 మంది హాజరుకాగా, మల్లేపల్లి సెంటర్‌లో 180 మందికి 180 మంది హాజరయ్యారని, తాళ్లూరు సెంటర్‌లో 161 మందికి గాను 158 మంది హాజరయ్యారని తెలిపారు. **జగ్గంపేట** జగ్గంపేటలో ఏర్పాటు చేసిన 6 కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 1405 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సివుండగా 1303 విద్యార్థులు హాజరయ్యారు. 102 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజర్ అయినట్లు ఎంఇఒ ఎం.స్వామి తెలిపారు. **పిఠాపురం** మండలంలో ఏర్పాటు చేసిన 8 కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 1557 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సివుండగా 1554 మంది హాజరయ్యారు. ముగ్గురు పరీక్షకు గైర్హాజరు అయ్యారు. ఎటువంటి మాస్ కాపీయింగ్, పేపర్ లేకేజ్‌లు జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఇదిలావుంటే.. స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన పరీక్షకు ఇద్దరు విద్యార్థులు కట్టులతో హాజరయ్యారు. మండలంలోని చిత్రాడ గ్రామానికి చెందిన వెంకటేష్ పట్టణంలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. గత నెల 14న ప్రమాదవశాత్తు బండి మీద నుంచి పడడంతో వెంకటేష్ ఎడమ చేతికి గాయం అయ్యింది. ఈరోజు జరిగిన పరీక్షకు చేతికి కట్టుతో హాజరయ్యాడు. స్థానిక చర్చ్ సెంటర్స్‌కు చెందిన వి.శశిధర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువు తున్నాడు. మూడు వారాల క్రితం కాలికి శస్త్ర చికిత్స జరగడంతో కాలికి కట్టుతోనే పరీక్ష కేంద్రానికి ఆటోలో వచ్చి పరీక్ష రాశాడు. **సామర్లకోట** పట్టణం, మండలంలో ఏర్పాటు చేసిన 9 కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో ప్రారంభం అయ్యాయి. 9 కేంద్రాల్లో 1710 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 1679 మంది హాజరైనట్టు ఎంఇఒ శివ రామకృష్ణయ్య తెలిపారు. 71 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని వెల్లడించారు. వేసవి దృష్ట్యా విద్యార్థుల కోసం తాగునీరు, ప్రథమ చికిత్స శిబిరం, పోలీసు బందోస్తును ఏర్పాటు చేశారు. పరీక్ష ఫ్లయింగ్ స్క్వాడ్ కాకినాడ అర్బన్ ఎంఇఒ వాణికుమారి బృందం సందర్శించారు. పరీక్షల నిర్వహణపై వారు సంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే పట్టణ, మండల పరిధిలోని పరీక్ష కేంద్రాలను ఎంఇఒ వై శివరామకృష్ణయ్య పర్యవేక్షించారు. **రౌతులపూడి** మండల వ్యాప్తంగా 552 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యారని ఎంఇఒ 2 గాడికొండ బాబు సోమవారం తెలిపారు. మండలంలోని ములగపూడి, రౌతులపూడి జడ్‌పి ఉన్నత పాఠశాలల్లోనూ, ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. **కరప** మండలంలో 6 కేంద్రాల్లో 10వ తరగతి పరీక్షలు జరిగాయి. వేలంగి, గొర్రిపూడి, వేములవాడ, కరప ఏ సెంటర్ కరప బి సెంటర్, పెద్దాపురపాడు, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన ఈ పరీక్షల్లో 1003 విద్యార్థులు హాజరు కావాల్సివుండగా 997 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఇఒ-2 పి.సత్య నారాయణ తెలిపారు. ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు.



పిఠాపురంలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు(ఇన్‌సెట్‌లో కట్టుతో పరీక్షకు వచ్చిన విద్యార్థి

ఘనంగా ముగిసిన భద్రతా వారోత్సవాలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న అధికారులు


ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక రాక్ సిరమిక్స్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ పరిశ్రమలో సోమవారం జాతీయ భద్రత వారో త్సవాలు ఘనంగా ముగిశా యి. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్స్పె క్టర్ రాధాకృష్ణ, ఇన్స్పె క్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఇన్స్పెక్టర్ మురళీ కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భద్రత పాటించాలని, తద్వారా పరిశ్రమ, సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని పిలుపునిచ్చారు. గత రెండు సంవత్సరాల నుంచి ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా భద్రతా ప్రమాణాలను విధిగా పాటిస్తున్న పరిశ్రమ కార్మికులను, యాజమాన్యాన్ని, సేఫ్టీ మేనేజర్ బాలాజీని వారు అభినందించారు. ఈ సందర్భంగా భద్రతా వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు. అలాగే కార్యక్రమంలో సంస్థ సిఇఒ అనిల్ కుమార్ బిజావత్ భద్రతా వారోత్సవాలను గురించి, భద్రత యొక్క ఆవశ్యకత గురించి వీడియో కాల్ ద్వారా తమ సందేశాన్ని పరిశ్రమ ఉద్యోగులకు, కార్మికులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఇతర ఉన్నతాధికారులు, హెచ్ఆర్ అండ్ అడ్మిన్ హెడ్ టి.నీరజ్ కుమార్, సప్లై మేనేజ్‌మెంట్ జిఎం రాజిందర్ సింగ్ మాన్, టైల్స్ హెడ్ వినోద పైక వాసుదేవ, శానిటరీ వేర్ హెడ్ చెల్లదురై, ఇహెచ్ఎస్ మేనేజర్ బాలాజీ, పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్ విజిఎస్.కుమార్, ఇతర కంపెనీ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

మండలంలో టిడిపి అభ్యర్థి సుభాష్ పర్యటన

ప్రజాశక్తి - కాజులూరు

టిడిపి రామచంద్రపురం నియోజకవర్గ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ మండలంలోని పెనుమల్ల, తర్లంపూడి గ్రామాల్లో పర్యటించారు. సోమవారం ఆయా గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో అభివృద్ధి, సంక్షేమం కరువయ్యిందన్నారు. ఉపాధి లేక యువతీ, యువకులు ఇతర రాష్ట్రాలకు వలసలు పోవాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ఇటువంటి దుర్మార్గమైన వైసిపి పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. టిడిపి అధికారంలోకి తీసుకొచ్చినట్లైతే అనేక పరిశ్రమలు తీసుకువచ్చి నిరుద్యోగ సమస్య తీరడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పేపకాయల బాబ్జి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ వనం వీరబ్రహ్మం, నందికోల్ల సత్యనారాయణ, రాయుడు వెంకటరమణ, సత్యనారాయణ, పోతుల మాధవ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుభాష్

విధుల్లో కుప్పకూలిన పంచాయతీ కార్యదర్శి




కార్యదర్శికి వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - పెద్దాపురం

విధులు నిర్వహిస్తూ అస్వస్థతకు గురై పంచాయతీ కార్యదర్శి కుప్పకూలిన సంఘటన సోమవారం గోరింట గ్రామంలో జరిగింది. మండలంలోని గోరంట గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మిదేవి పంచాయితీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఫోన్లో మాట్లాడుతుండగా ఒకేసారి చెమటలు పట్టి కుప్పకూలారు. వెంటనే సచివాలయ, పంచాయతీ సిబ్బంది, సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎఎన్ఎంలు ప్రాథమిక చికిత్స అందించి సమీపంలోని పులిమేరు పిహెచ్‌సికి తరలించారు. అక్కడ నుంచి ఆమెను మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కార్టూ'నిజం'



దేశ సమైక్యత కోసం కృషి చేయాలి



సూర్యాఆరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కృష్ణయ్య

ప్రజాశక్తి - కాకినాడ

దేశాన్ని మత విభజన చేస్తూ ప్రజల మధ్య చిచ్చుపెట్టే కుట్రలకు వ్యతిరేకంగా పోరాడి దేశ సమైక్యతను కాపాడుకోవడం కోసం వ్యక్తులుగా, సంస్థలుగా కృషి చేయడమే వాసంశెట్టి సూర్యారావుకు నిజమైన నివాళి అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అన్నారు. విఎస్ఆర్ ఐడియల్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక యుటిఎఫ్ హోంలో సోమవారం జరిగిన ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకుడు వాసంశెట్టి సూర్యారావు 5వ వర్ధంతి సభ జరిగింది. 70 దశకంలో తాను ఇంజ నీరింగ్ విద్యార్థిగా ఉన్నప్పుడు జెఎన్‌టియు, ఐడల్ కాలేజీ తదితర విద్యాసంస్థల్లో జరిగిన అనేక విద్యార్థి ఉద్యమాలకు, పోర్టు కార్మికులు, రైస్ మిల్ తదితర కార్మిక పోరాటాలకు వాసంశెట్టి సూర్యారావు అండగా నిల బడ్డారని గుర్తు చేశారు. తాను వామపక్ష భావ జాలం వైపు నిలబెట్టడంలో సూర్యారావు ఆదర్శ నీయమైన పాత్ర పోషించాడని కొనియాడారు. ప్రస్తుతం దేశంలో విచ్ఛిన్నకర పద్ధతిలో జరుగుతున్న పాలన వల్ల దేశ సమగ్రతకు ప్రమాదం ఏర్పడ బోతుందని అన్నారు. ఇటువంటి కుట్ర లను, కుతంత్రాలను వాసంశెట్టి సూర్యారావు వంటి అమరులను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావడం వల్లే వారికి నిజమైన నివాళులు అర్పించిన వారం అవుతామని అన్నారు. విఎస్ఆర్ ఐడియల్ స్టడీ సెంటర్ కన్వీనర్ సిహెచ్.కిరణ్ కుమార్ అధ్యక్షతన తొలుతగా సూర్యారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్య క్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమలశెట్టి నాగేశ్వ రరావు, జిల్లా కార్యదర్శి జి. అప్పారెడ్డి, కౌలు రైతు సం ఘం జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్, జిల్లా కార్యదర్శి వళ్ళు రాజబాబు, సామాజిక కార్యకర్త పెద్దిం శెట్టి రామకృష్ణ, యుటిఎఫ్ సీనియర్ నాయకురాలు వి. సోనీ, కోనేటి రాజు, ఐ.ప్రసాదరావు, దారపురెడ్డి సత్య నారాయణ, గంగా సూరిబాబు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



హోర్డింగులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఉషారాణి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎన్నికల కోడ్ ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ కన్వీనర్, ఎంపిడిఒ ఉషారాణి హెచ్చరించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులతో టెలికాన్ఫరెన్స్ జూమ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి 48 గంటలు గడిచినా ఇప్పటివరకు మండల పరిధిలోని గోరింట గ్రామంలో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు తొలగించలేదన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఎవరిని ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం ఇఒపిఆర్‌డి రాజశేఖర్, సచివాలయ సిబ్బందితో కలిసి గోరింట వెళ్లి ఫ్లెక్సీలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ రాజబాబు, విఆర్‌ఒ బాబురావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - గండేపల్లి, రాజానగరం

ఆస్పత్రికి వెళ్ళి తిరిగి వస్తుండగా జరిగిన సోమవారం రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికుల తెలిపిన వివరాలు...మండలంలోని ఎన్‌టి రాజాపురానికి చెందిన పిల్లి దుర్గారావు ఆయన భార్య లోవకుమారి రాజమహేంద్రవరం నగరానికి ఆసుపత్రి పనిపై బైకుపై వెళ్లారు. ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించుకుని తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో రాజానగరం ఐఎస్‌టిఎస్ కళాశాల వద్ద బైకును ట్రాలీ లారీ ఢీకొనడంతో లోవకుమారి (38) అక్కడికక్కడే మృతి చెందింది. భర్త గాయాలపాలయ్యారు. ఆమెకు ఇద్దరు కుమారులుఉన్నారు. సంఘటనా స్థలం వద్ద భార్య మృతదేహంపై భర్త పడి విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ఈ విషయం తెలిసిన వెంటనే మృతురాలు కుమారులు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. జడ్‌పిటిసి సభ్యులు పరిమి వెంకటలక్ష్మీ మంగతాయారు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

230 బైండోవర్ కేసుల నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలోని 17 గ్రామాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా 230 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ ఎస్.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. బైండోవర్ కేసులు నమోదుచేసిన వారిని తహశీల్దార్ కోర్టులో ప్రవేశపెట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు

పేకాడుతున్న 8 మంది అరెస్టు

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం ఎస్‌ఐ రామకష్ణ ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై సిబ్బందితో కలిసి సోమవారం దాడులు నిర్వహించారు. గ్రామ శివారులో పేకాట స్థావరం దాడిచేసి ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3700 నగదును, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ఎస్ఎన్ పట్నం గ్రామానికి చెందిన వైసిపికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. సోమవారం టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరపుల సత్యప్రభ ఎస్ఎన్ పట్నంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో టిడిపి, జనసేన,.బిజెపి కూటమి అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలు నష్టపోయారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, కావున ఓటర్లు తమ విలువైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తమరాల సత్యనారాయణ, ఎంపిపి గటిమల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపిపిలుభాస్కర్ బాబు, పైల సాంబశివరావు, స్థానిక నాయకులు అప్పలనాయుడు, మాజీ ఎంపిటిసి సభ్యులు అల్లం బాబు, నాగం రాము పాల్గొన్నారు.

సీతారాంపురంలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

రాబోయే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను గెలిపించాలని పార్టీ నాయకులు కోరంగి పంచాయతీ సీతారాంపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి టేకుమూడి అనంతలక్ష్మి, మాజీ జడ్‌పిటిసి పొన్నమండ రామలక్ష్మి ఆధ్వర్యంలో సీతారాంపురం, గొల్లల వీధి, కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. భవిష్యత్తు గ్యారంటీ కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాడ్రేవు వీరబాబు, టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి వెంకటరమణ, నడింపల్లి వినోద్, కొప్పిశెట్టి చంటి, గంజా సూరిబాబు, కృష్ణవేణి, సోమరాజు పాల్గొన్నారు.

వైసిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - పెదపూడి

మండలంలోని దోమడ గ్రామంలో సోమవారం వైసిపి అనపర్తి నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మికి మహిళలు పెద్ద ఎత్తున హారతు లిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించడమే జగన్ లక్ష్యమన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తన భర్త సత్తి సూర్యనారాయణరెడ్డి శక్తి వంచన లేకుండా కృషి చేశారన్నారు. మరోసారి వైసిపికి అండగా నిలవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందితో కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన సువిధా, సి విజిల్, ఎమ్‌సిసి, ఎమ్‌సిఎంసి, వీడియో రికార్డింగ్ మోనటరింగ్ విభాగం, మీడియా పాయింట్ తదితర విభాగాలను ఎస్‌పి పి.జగదీష్‌తో కలెక్టర్ మాధవీలత కలిసి పరిశీలించారు. అనంతరము కలెక్టరేట్ లో ఎన్నికల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయడంలో భాగంగా వివిధ రకాల విధులను నిర్వర్తించే వారూ అందచేసే నివేదికలు ఎప్పటికప్పుడు ఈ సిఐ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియ లో సి విజిల్ ద్వారా వచ్చె ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, కచ్చితంగా 100 నిమిషాల్లో ప్రతిస్పందన ఉండాలని, నివేదికలు పంపించాలన్నారు. ఈ విషయంలో ఎటువంటి ఆలస్వతానికి తావు ఇవ్వరదన్నారు. నామినేషన్ల దాఖలు, రాజకీయా పార్టీల సమావేశాలకు అనుమతులు తదితర అంశాలపై రాజకీయ పార్టీలకు అవగాహన కల్పించడం, సందేహాలు నివృత్తి చేసేందుకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిరంతరం అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. మాస్టర్ ట్రయినర్ ఇతర సిబ్బందికి శిక్షణ ఇవ్వడం, ఆన్లైన్‌లో ఏ ఏ నివేదికలు పంపడం పై అవగాహన కల్పించడం జరుగుతోందనీ అధికారులు కలెక్టర్ కి వివారించారు. టివిల్లో, సోషల్ మీడియాలో వస్తున్న కథనాలపై, వివిధ పత్రికల్లో వచ్చే కథనాలు పై ప్రత్యేక నిఘా పెట్టి, ఎమ్‌సిసి ఉల్లంఘనలకు పాల్పడే వారికి నోటీసులు ఇవ్వటం, వాటికి చెందిన సమాచారాన్ని ఎన్నికల కమిషన్ కి పంపడం జరగాలన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం అవసరం

ప్రజాశక్తి - కాకినాడ


సమావేశంలో చర్చిస్తున్న లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ప్రతినిధులు

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం భారతదేశ పౌరులకు అవసరమని లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక అభిప్రాయపడింది. సోమవారం స్థానిక సుందరయ్య భవన్లో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక సమావేశం కన్వీనర్ అయితాబత్తుల రామేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దళిత సంఘాలు, మైనార్టీ సంఘాలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామికవాదులు హాజరై మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చడానికే అధికారంలోకి వచ్చామని బిజెపి మంత్రులు మాట్లాడుతున్నారని, కానీ నరేంద్ర మోడీ రాజ్యాంగం చాలా గొప్పదని మాట్లాడుతున్నారని అన్నారు. ఈ రకమైన ద్వంద్వ వైఖరితో ప్రజలను మోసగిస్తూ మెజారిటీ హిందువుల ఓట్లను కొల్లగొట్టడం కోసం ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తరతరాలుగా భారతదేశంలో నివసిస్తూ స్వాతంత్ర పోరాటంలో దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన ముస్లింలను, మైనార్టీలను ఈ దేశం నుంచి వెళ్లగొట్టాలని రహస్య జెండాతో బిజెపి పనిచేస్తుందని దుయ్యబట్టారు. సిఎఎ ద్వారా ప్రజల మధ్య విభజన తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని విమర్శించారు. ఇలాంటి బీజేపీకి ఆంధ్ర రాష్ట్రంలోని మూడు ప్రధానమైన రాజకీయ పార్టీలు వత్తాసు పలుకుతూ బిజెపికి తొత్తులుగా వ్యవహరిస్తున్నాయన్నారు.బిజెపిని మరోసారి అధికారంలోకి రాకుండా చేయాల్సిన అవసరం మొత్తం భారత ప్రజానీకానికి ఉందని అన్నారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాజ్యాంగ రక్షణ కోసం పనిచేస్తుందని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిలుస్తుందని తెలిపారు. అందుకోసం రాబోయే కాలంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు అనేక రూపాల్లో కార్యక్రమాలు చేపట్టాలని ఈ సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో ప్రముఖ న్యాయవాది జవహర్ అలీ, ప్రముఖ సామాజిక వేత్త దూసర్లపూడి రమణ రాజు, సిపిఎం జిల్లా కన్వీనర్ మోర్త రాజశేఖర్, ఆర్‌పిఐ నాయకులు పిట్టా వరప్రసాద్, ఆమ్‌ఆద్మీ కన్వీనర్ నరాల శివ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు కంచపు సత్తిరాజు, రాష్ట్రీయ క్రైస్తవ పరిషత్ నాయకులు కాశి బాలయ్య, సమాచార హక్కు కార్యకర్త పప్పు దుర్గారమేష్, ఐఎఫ్‌టియు నాయకులు జె.వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కెఎస్ శ్రీనివాస్, ఐలు నాయకులు సిహెచ్.అజయ్ కుమార్, కెవిపిఎస్ నాయకులు సురేష్, మానవ హక్కుల వేదిక కార్యదర్శి పోలాబత్తుల శ్రీనివాసరావు, సైపుల్ల, నజీరుద్దీన్, రచయిత గదుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో డిఆర్ఒ సమావేశం

ప్రజాశక్తి - కాకినాడ


సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ తిప్పేనాయక్

జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు రాజకీయ నాయకుల ప్రచారాలకు ఉపయోగించే కరపత్రాలు, గోడ పత్రికలను ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ముద్రించాలని డిఆర్ఒ డాక్టర్ డి.తిప్పేనాయక్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో డిపిఆర్ఒ డి.నాగార్జునతో కలిసి జిల్లాలోని వివిధ ప్రింటింగ్ ప్రెస్ యజమా నులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో ప్రింటింగ్ ప్రెస్ యజమా నులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గ స్థానాలకు రానున్న మే నెల 13న ఎన్నిక జరగనుందన్నారు. భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని, జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్వతంత్ర అభ్యర్థులు ఉపయోగించే కరపత్రాలు, గోడ పత్రికలు ఇతర ప్రచార పత్రాలను ముద్రించాలన్నారు. గోడ పత్రికలు, కరపత్రికలకు సంబంధించిన సైజ్, ధర, కాపీల సంఖ్య వంటి అంశాల్లో తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలను పాటించాలన్నారు. వివిధ ప్రింటింగ్ ప్రెస్‌లలో ముద్రించిన వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థుల ప్రచార పత్రాలను ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులకు అందజేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ ప్రెస్‌లకు సంబంధించిన ప్రతినిధులు కెవి.జానకిరామ్, సిహెచ్.కిరణ్‌కుమార్, పి.రాజేష్, జి.శ్రీను, జె.రామకృష్ణ పాల్గొన్నారు.

కొంగోడులో టిడిపి, జనసేన ప్రచారం


ప్రచారంలో నానాజీ, పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి - కరప

ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబు, జనసేన పార్టీ నియోజకవర్గ అభ్యర్థి పంతం నానాజీ ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. సోమవారం మండలంలోని కొంగోడు గ్రామంలో వారు పర్యటించి ఇంటింటికి వెళ్లి రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. వైసిపి వాళ్లు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పుకొట్టాలని పిలుపునిచ్చారు. సంక్షేమానికి మేము దూరం కాదని, అర్హులైన వారందరికీ ప్రతి పథకాన్ని అమలు చేయాలన్నదే తమ డిమాండ్ అని అన్నారు. కూటమి ప్రభుత్వాన్ని బలపరిచి గ్లాసు గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి గుల్లిపల్లి శ్రీనివాసరావు, జనసేన నాయకులు వనుం నారాయణ రావు, కోటగిరి మహేంద్రబాబు, చంద్రు వెంకన్న రాయ్‌చౌదరి, మామిడాల వెంకటేష్, ఆట్ల గోవిందరాజు, పంపన కన్నారావు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టండి: కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గర పడుతున్నందున పన్ను వసూళ్ళపై ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశించారు. సోమవారం స్మార్ట్‌సిటీ కార్యాలయంలో పన్నుల వసూళ్ళపై అదనపు కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.45 కోట్లు డిమాండ్‌కు గాను ఇప్పటికే రూ.36 కోట్లు వసూళ్ళు అయ్యిందన్నారు. మిగిలిన 9 కోట్లను మార్చి నెలాఖరునాటికి వసూళ్ళు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పన్ను వసూళ్ళలో నిర్ధేశించిన లక్ష్యాలను అధిగమించి నూరుశాతం వసూళ్ళు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆస్తిపన్నులతోపాటు ఖాళీస్థలాలు, కుళాయిపన్నుల వసూళ్ళపై చర్యలు తీసుకోవాలని సూచించారు. పాతబకాయిలకు సంబంధించి వడ్డీరాయితీ ఉన్నందున పన్ను బకాయిదారులకు వివరించి వాటిపై కూడా దృష్టి పెట్టాలన్నారు. అదే సమయంలో ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించి సహకరించాలని కోరారు. ప్రజలు చెల్లించే పన్నులతోనే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో మీడియా బాధ్యత కీలకం

ప్రజాశక్తి-అమలాపురం

పార్లమెంట్ అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలు - నిర్వహణ లో మీడియా బాధ్యత కీలకమని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి భవన్ నందు మీడియా ధవీకరణ పర్యవేక్షణ కమిటీ ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధులకు సార్వత్రిక ఎన్నికలు-2024 నిర్వహణ తీరు పాత్రికేయుల పాత్ర అంశంపై ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికే యులతో అవగాహన కార్యక్రమాన్ని జిల్లా రెవెన్యూ అధికారి ఆధ్వ ర్యంలో ఎంసిఎంసి కమిటీ కన్వీనర్ డిఐపిఆర్ఓ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా పాత్ర కీలకమైనదన్నారు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని ఓటు హక్కును సద్వినియోగం చేసుకునే దిశగా ప్రసార మాధ్యమాల ద్వారా ఓ టర్లను చైతన్య పరచాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ కు సంబంధించిన సమాచారాన్ని మీడియా కేంద్రం ద్వారా అందించడం జరుగుతుందన్నారు ఎన్ని కల వార్తల సేకరణ నిమిత్తం మీడియా ప్రతినిధులకు పోలింగ్ కౌంటింగ్ ప్రక్రియల కు సంబంధించి ఎన్నికల కమిషన్ చే పాసులు జారీ చేస్తామన్నారు ఎన్నికల వార్తలు వాస్తవికతను ప్రతిబింబించేలా మాత్రమే రాయాలని, పెయిడ్ న్యూస్ అసత్య వార్తలు ప్రచురిస్తే ఎన్నికల సంఘం తీసుకుని చర్యలకు బాధ్యత వహించాల్సి వస్తుంద న్నారు ఎన్నికలకు సంబంధించి మీడియా ద్వారా ప్రసారం చేసే ప్రకటనలకు ముందుగా ఎంసిఎంసి అనుమతులతో ధ్రువపత్రాలు తప్పని సరిగా పొందాలన్నారు. బాధ్యతా రహితంగా సామాజిక మాధ్యమాల్లో అసత్య వార్తలను పోస్ట్ చేస్తే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సిబ్బంది, అధికారులతో సమానంగా మీడియా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించాలని కోరారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి పాత్రికే యులు వాస్తవమైన సమాచారంతో కూడిన రిపోర్టింగ్ చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఉల్లంఘనలపై వార్తలు రాసి అభ్యర్థులకు, ప్రజలకు అవగాహన కలిగించడానికి మీడియా కషి చేయాలని స్పష్టం చేశారు. ఎంసి ఎంసి కన్వీనర్ డిఐపిఆర్ఓ కె లక్ష్మీనారాయణ పెయిడ్ న్యూస్ మీడియా సర్టిఫికేష న్ మానిటరింగ్ అంశాలపై పాత్రికేయులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సవివరంగా అవగాహన కల్పించారు. . ఎన్నికల మార్గ దర్శకాలు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై తీసుకునే చర్యలను ఆయన మీడియాకు వివరించారు.ఓటు హక్కు వినియోగం ప్రాముఖ్యతపై స్వీప్ కార్యక్రమాల ద్వారా ఓటింగ్ శాతాన్ని మరింత పెంచేందుకు చర్యలు ప్రసార మాధ్యమాల ద్వారా తీసుకోవాలన్నారు. జిల్లా గ్రామ వార్డు సచివాలయ నోడల్ అధికారి కె. భీమేశ్వ రరావు పాత్రికేయులు అనుసరించాల్సిన ఎన్నికల ప్రవర్తన నియమావళిని గూర్చి వివరించారు. డిఆర్‌డిఎ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, సి విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు పరిష్కారం మీడియా పాత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ పార్లమెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎం.ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నా రు.

పట్టణంలో 'గడప..గడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణం 28 వ వార్డు చింతపల్లి సూరన్న నగర్ లో సోమవారం గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైసిపి ఇన్చార్జి పిల్లి సూర్యప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం జగన్ అమలు చేసిన పథకాల గురించి ప్రజలకు సూర్యప్రకాష్ వివరించారు. రాబోతున్న ఎన్నికల్లో వైసిపి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ చైర్ పర్సన్ గాదం శెట్టి శ్రీదేవి శ్రీధర్, వైస్ చైర్ పర్సన్ చింతపల్లి నాగేశ్వరరావు, వార్డు నాయకులు వీరన్న శెట్టి , కుడుపూడి భీమ శంకర్ , దంగేటి సూరిబాబు, కుడిపూడి రామకృష్ణ, యనమదల మల్లి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సూర్య ప్రకాష్

నూకాంబిక అమ్మవారి జాతరపై సమీక్ష

ప్రజాశక్తి-ఆలమూరు


సమీక్ష నిర్వహిస్తున్న ఆర్‌డిఒ సత్యనారాయణ

ఆలమూరు తహశీల్దార్ కార్యాలయంలో చింతలూరు నూకంబిక అమ్మవారి ఉత్సవాలపై కొత్తపేట ఆర్‌డిఒ జివివి.సత్యనారాయణ పలు శాఖల అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ కో-ఆర్డినేషన్ చైర్మన్ జివివి.సత్యనారాయణ అధ్యక్షతన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, రామచంద్రపురం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బాలాజీ రాంప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 7న జాతర, 8న తీర్థం, 9న ఉగాది నుంచి నెల రోజులు పాటు జరిగే అమ్మవారి ఉత్సవాలు విజయవంతం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆర్‌డిఒ అన్నారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్యశాఖ, పారిశుధ్యం, శాంతి భద్రతలు, మంచినీరు, అగ్నిమాపక శాఖలతో చర్చించి సలహాలు ఇచ్చారు. యాత్రికులకు అందించే ఏర్పాటు సౌకర్యాలపై చర్చించారు. కార్యక్రమంలో డిఎల్‌డిఒ రాజేశ్వరరావు, తహశీల్దార్ అనిల్ కుమార్, ఎంపిడిఒ మేరీ రోజ్, సిఐ రామ్ కుమార్, ఎస్‌ఐ శ్రీను నాయక్. ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్. శివరామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ భాస్కర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా అంబేద్కర్ కాలనీ రోడ్డు

ప్రజాశక్తి-మండపేట


ధ్వంసమైన అంబేద్కర్ నగర్ కాలనీ రోడ్డుల

ఏడిద గ్రామంలోని అంబేద్కర్ నగర్ లోని కాలనీ రోడ్డు దిగిపోయి ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డు దిగిపోవడంతో డ్రయిన్ మూసుకు పోయింది. దీంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం అంతటా అభివద్ధి పనులు జరుగుతున్న ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోవడం ఆంతర్యం ఏమిటని ఇది నిర్లక్ష్యమా లేక నిధులు లేమా అని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డుకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


సమాజంలో మాట్లాడుతున్న ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్

ఎపికి ప్రత్యేక హోదా అమలు చేయని బిజెపి

ప్రజాశక్తి-అమలాపురం

కేంద్రంలో బిజెపి ఎపికి ప్రత్యేక హోదా అమలు చేయలేదని, పోలవరం పూర్తి చేయలేదని, రాజధాని నిర్మాణానికి సహాయం చేయలేదని పునర్వ్యవస్థీకరణ చట్టంలోని అంశాలను ఏమీ అమలు చేయలేదని ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ విమర్శించారు. సోమవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎపికి కేంద్రంలోని బిజెపి తీరని ద్రోహం చేసిందని అన్నారు. ఎపిలో మోడీ కూటమిని ఓడిస్తే నే రాష్ట్రానికి ఆత్మ గౌరవం, అభివృద్ధి వుంటుందన్నారు మోడీ కూటమిలో రహస్య మిత్రుడు జగన్ మోహన్ రెడ్డి అయితే బహిరంగ మిత్రులు చంద్ర బాబు, పవన్ కళ్యాణ్‌లని అన్నారు. అయినప్పటికీ మోడీతో కూటమి కోసం జగన్, చంద్ర బాబు , పవన్ కళ్యాణ్ పొత్తులకు పాకులాడటం సిగ్గు చేటని విమర్శించారు. జిల్లా అధ్యక్షులు కామన ప్రభాకర రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ప్రజలలో ఆదరణ పెరిగిందన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కీలక భూమిక పోషిస్తుంది అని అన్నారు. సమావేశంలో పిసిసి ఉపాధ్యక్షులు కొత్తూరు శ్రీనివాసరావు, ముషిణి రామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శిలు అయితాబత్తుల సుభాషిణి, మాచవరపు శ్రీమన్నారాయణ. పిసిసి అధికార ప్రతినిధి గెడ్డం సురేష్ బాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులతో విప్పర్తి ఆత్మీయ కలయక

ప్రజాశక్తి -మామిడికుదురు

లూటుకుర్రు, బాడిలంక ప్రాంతాలలో కాంగ్రెస్ సీనియర్ నాయకులను పి గన్నవరం వైసిపి అభ్యర్థి విప్పర్తి వేణుగోపాల్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించుకున్నారు వారిని తమ విజయానికి సహరించాలని కోరారు. ఆయన వెంట జక్కంపూడి తాతాజీ, తొరం భాస్కర్ రావు, కొనుకు నాగరాజు, నెల్లి దుర్గా ప్రసాద్, చింతా రామకృష్ణ, కొమ్ముల రాము తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

గవర్నర్ తమిళసై రాజీనామా

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళ సై సౌందర్యరాజన్ సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు తన రాజీనామా లేఖను పంపించారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడులో ఏదో ఒక స్థానం నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది.

ముగిసిన ఎన్ఎస్ఎస్ క్యాంపు

ప్రజాశక్తి - యానాం

యానాంలోని డాక్టర్ ఎస్ఆర్‌కె.ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వారం రోజుల పాటు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం సోమవారంతో ముగిసింది. చివరి రోజున వలంటీర్లకు, విద్యార్థులకు యోగా, ధ్యానంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ముగింపు సభలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, డాక్టర్ శాంతి కుమార్, ఎన్ఎస్ఎస్ రీజనల్ కో-ఆర్డినేటర్ సిహెచ్.కృష్ణ సుధాకర్, కళాశాల హెచ్ఒడిలు, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు. ఈ సభలో వలంటీర్లకు సర్టిఫికెట్లను అతిథులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ పిఒలు డాక్టర్ సిహెచ్.నరేష్, ఎస్.శ్రీనివాస్ పర్యవేక్షించారు.

10వ తరగతి పరీక్షకు 617 మంది హాజరు

ప్రజాశక్తి - యానాం

10వ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. యానం నియోజకవర్గంలో మొత్తం 620 మంది విద్యార్థులు పరీక్షలకు కావాల్సివుండగా 617 మంది హాజరయ్యారు. యానంలో పండిట్ జవహర్ లాల్ నెహ్రూ గవర్నమెంట్ హైస్కూల్ మెట్టకూరులో మొత్తం విద్యార్థులు 190 మందికి 188 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఎంజిజి బాయ్స్ హైస్కూల్లో 220 మంది పరీక్షకు హాజరయ్యారు. ఎస్‌కెఎస్‌పివిఆర్ఎస్ గవర్నమెంట్ హైస్కూల్ కనకాలపేటలో 210 మందికి 209 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ప్రాంతీయ విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ తెలిపారు. ఏటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పై మురుగన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - పెద్దాపురం


కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయ హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.30,92,530 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. 95 రోజులకు సంబంధించిన హుండీలను మరిడమ్మ దేవస్థానం ఎసి సిహెచ్.రామమోహన్‌రావు, దేవాదాయ శాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయబాబునాయుడు, కాకినాడ సంత చెరువు కనకదుర్గ దేవస్థానం ఇఒ జోకా సత్యనారాయణల సమక్షంలో హుండీలను తెరిసి ఆదాయాన్ని లెక్కించారు. హుండీల ద్వారా రూ.25,72,940, అన్నదాన హుండీల ద్వారా రూ 5,19,560 ఆదాయం సమకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, కర్మకర్తలు కుంచే వెంకన్న, అడబాల జగ్గారావు, అర్చ కులు లు పాల్గొ న్నారు.